క్లుప్తంగా

పలువురికి ఎమ్మెల్యే వాసుపల్లి ఆర్థిక సాయం



వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు ఆర్థిక సహకారం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సహకారం అందజేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న 33వ వార్డు వేంకటేశ్వరమెట్టలో నివసిస్తున్న తాడుతూరి ప్రసాద్‌కు మందుల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, కుమ్మరవీధికి చెందిన బొద్దాన పార్వతికి రూ.5 వేలు అందజేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న 34వ వార్డు కొబ్బరితోట ప్రాంతానికి చెందిన ఎలక ఆకునాయుడుకు మందుల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, నైట్ స్వీపర్‌గా పనిచేస్తూ ప్రమాదంలో కాలుపూర్తిగా తొలగించిన 37వ వార్డు ఆసిపాప వీధి నివాసి వాసుపల్లి అప్పల నర్సమ్మకు రూ.5 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట స్టేట్ డైరెక్టర్లు సనపల రవీంద్ర, డేవిడ్ రాజు, జేసీజే అధ్యక్షుడు కర్రి నీలకంఠం, నొల్లు పోతురాజు, లింగం శ్రీను, లండా రమణ , బొడ్డేటి ప్రసాద్, బోణి దేవ, ఆదివిష్ణు, బొర్రా విజయలక్ష్మి, మాదాబత్తుల రమేష్, వలిశెట్టి లక్ష్మి, కొల్లు సత్యవతి, దూడ అప్పారావు, కాసారపు వాసు, వెంకటలక్ష్మి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి పింఛన్ అందజేత



దివ్యాంగురాలికి పింఛన్ అందజేస్తున్న బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం : గౌరీ స్ట్రీట్ సచివాలయం పరిధిలోని జి.రమ్యకు రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ పింఛను మంజూరు చేసింది. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, సచివాలయ కార్యదర్శి పీవీ కిరణ్‌కుమార్, జాన్‌బాబు, కన్వీనర్ కొడమంచిలి శ్రీను, వలంటీర్ నవీన్‌లతో కలిసి ఆమె ఇంటి వద్ద శనివారం పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అర్హత గల ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మేలు చేకూరుస్తుందని తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు కల్లుపాకలు, ప్రసాద్‌గార్డెన్స్ ప్రాంతాల్లో దోమలు ఉత్పత్తి కాకుండా యాంటీ లార్వా ఆపరేషన్లతో పాటు ఫాగింగ్ చేశారు. ఇంటింటికీ వెళ్లి దోమల వలన కలిగే వ్యాధులపై అవగాహన కలిగించారు. ఇంట్లోని ఫ్రిజ్‌ల వెనుక భాగాన్ని తరచూ శుభ్రం చేయాలని, తాగి పారేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఇంటి పరిసరాల్లో ఉంచరాదన్నారు. ముఖ్యంగా ఇళ్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రిలో అన్నసమారాధన



అన్నదాన కార్యక్రమంలో కొణతాల శ్రీనివాస్

దాబాగార్డెన్స్ : గాయత్రిదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యోతి స్వరూప అన్నప్రసాద వితరణ కార్యక్రమం శనివారం దక్షిణ నియోజకవర్గ పరిధి ప్రభుత్వ విక్టోరియా (ఘోషా) ఆసుపత్రిలో నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేషెంట్లతో పాటు వారి సహాయకులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కొప్పుల రామ్‌కుమార్, పిల్లా నూకరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న గణపయ్యలు

- నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలకు సర్వం సిద్ధం
- వీధుల్లో గణపతి మండపాల ముస్తాబు
- 18 నుంచి నవరాత్రులు ప్రారంభం

చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ వేడుకగా నిర్వహించుకునే వినాయక చవితి ఉత్సవాలకు నియోజకవర్గంలో ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. పలు అసోసియేషన్లు, సంస్థలు చవితి ఉత్సవాలకు అందమైన మండపాలు సిద్ధం చేశాయి. వీధుల్లో గణేశుని ఉత్సవాలకు యువకులు పందిళ్లు వేశారు. 18 నుంచి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు అంతా సిద్ధమయ్యారు.



అల్లిపురం మెయిన్‌రోడ్డులో ముస్తాబవుతున్న గణపతి ఆలయం



కుమ్మరివీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం



నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో ఏర్పాటు చేసిన మండపం

అల్లిపురం : వినాయక చవితి ఉత్సవాల శోభ నియోజకవర్గంలో వెల్లివిరుస్తోంది. గణపతిని ఆహ్వానించేందుకు ప్రజలు అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. వీధుల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు గణేష్ మండపాలు ముస్తాబు అవుతున్నాయి. ఈ నెల 18వ తేదీ సోమవారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలను వినియోగించుకోవాలని కాలుష్య నియంత్రణ బోర్డు, ప్రభుత్వం ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో పూర్ణామార్కెట్ ప్రాంతంలో గత ఆరు దశాబ్దాలుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా అల్లిపురం నేరెళ్లకోనేరు జంక్షన్‌లో ఐదు దశాబ్దాలుగా వేడుకలు చేపడుతున్నారు. నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో శ్రీ గణపతి నీలమాంబ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది విభిన్న రూపాలలో గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా విభిన్న రూపంలో గణపతిని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా నియోజకవర్గంలో గణపతి ఆలయాలు ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి.

ముందస్తు అనుమతులు తప్పనిసరి..

వినాయక మండపాలను ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా అనుమతులు తీసుకోవాల్సిందే. అదే విధంగా తాత్కాలికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలి. పోలీసు, జీవీఎంసీ నుంచి అనుమతులు తీసుకుని మండపాలు ఏర్పాటు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకుల ఫోన్ నంబర్లు తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలి.

18 సంవత్సరాలుగా..



గత 18 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఒక విభిన్న రూపంలో గణపతిని నెలకొల్పి ఉత్సవాలు చేపడుతున్నాం. ఈ ఏడాది కూడా గణపతిని ప్రత్యేక రూపంలో ఏర్పాటు చేస్తున్నాం.

– భీశెట్టి గోపీకృష్ణ, శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్

నిబంధనలు పాటించాల్సిందే..

గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే నిర్వాహకులు నిబంధనలు పాటించాల్సిందే. నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ అధికారులు సూచించిన విధంగా మండపాల వద్ద ఏర్పాట్లు చేసుకోవాలి. పోలీస్, ఫైర్ ఫోన్ నంబర్లు ఏర్పాటు చేయాలి. సురక్షితంగా వేడుకలు నిర్వహించేందుకు తగిన తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– బి.తిరుమలరావు, టూటౌన్ సీఐ

మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్ష



గ్రంథాలయం ఆవరణలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న మార్వారి సమ్మేళన్ ప్రతినిధులు



శిక్షణలో పాల్గొన్న జీవీఎంసీ పాఠశాల పిల్లలు

అల్లిపురం : మట్టి విగ్రహాలతోనే పర్యావరణానికి రక్ష అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని ఆయన నియోజకవర్గ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేంకటేశ్వరమెట్ట శ్రీ వేంకట గౌరీశంకర గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, ఎం.రమేష్, దేవా, అయ్యప్పరెడ్డి, ఎస్‌వీజీఎస్ అధ్యక్షుడు భీశెట్టి శ్రీను, కార్యదర్శి మోహన్, అరుగుల రాజ్‌కుమార్, కామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీకాంతం, కొల్లి సత్యవతి, గంగ, చంద్రకళ, టి.అనురాధ, తాడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బంగారుమెట్టపై..

బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్రయువజన సమాజం కార్యదర్శి బీశెట్టి హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి వినాయక విగ్రహాలను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సమాజం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో..

33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు వేగి వెంకటప్పారావు ఆధ్వర్యంలో వేంకటేశ్వరమెట్టపై జరిగిన కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సుమారు 500 విగ్రహాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆడారి వెంకటమహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాదేశిక్ మార్వారి సమ్మేళన్ ఆధ్వర్యంలో..

దాబాగార్డెన్స్ : పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలనే పూజకు వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక్ మార్వారి సమ్మేళన్ రాష్ట్ర కార్యదర్శి పోదేశ్వర్ పురోహిత్ పిలుపునిచ్చారు. పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలు శనివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సంస్థ కార్యాలయం వద్ద పలువురు ప్రముఖుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్వారి సమ్మేళన్ అధ్యక్షుడు బిజేంద్రగుప్తా, కోశాధికారి రాజేష్ బన్సాల్, సేవ్ టెంపుల్స్ ప్రతినిధి పిన్నమనేని శ్రీనివాస్, జేడీ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్. కృష్ణయ్య, స్టెప్ ఇన్ ఫర్ హెల్ప్ ప్రతినిధి వర్మ దాట్ల, సీనియర్ పాత్రికేయులు యుగంధర్‌రెడ్డి, ఎంఎస్‌ఆర్‌ఎల్ వర్మ, హరనాథ్, ఎన్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ

జీవీఎంసీ 29వ వార్డుకు చెందిన చందక అప్పలరాజు పేదలు వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ ఉచితంగా మట్టి విగ్రహాలతో పాటు పాలవెల్లి, గొడుగు, పూజా ద్రవ్యాలు పంపిణీ చేశారు. సుమారు 2 వేల మంది భక్తులకు ఈ సాయం అందజేశారు.

మట్టి వినాయక ప్రతిమల తయారీపై విద్యార్థులకు శిక్షణ

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు జీవీఎంసీ, రేంజర్స్ ఫోర్స్, గ్రీన్ క్లెమైట్ సంయుక్తంగా నగర పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు శనివారం మట్టి వినాయక ప్రతిమల తయారీపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించాయి. రేంజర్‌ఫోర్స్ వ్యవస్థాపకుడు ఎస్. నాగేంద్రబాబు, గ్రీన్‌క్లెమైట్ కార్యదర్శి జేవీ రత్నం ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలోని 165 పాఠశాలల్లో 70 వేల మంది విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమల తయారీపై శిక్షణ ఇచ్చారు. రేంజర్‌ఫోర్స్ 100 పాఠశాలల్లోనూ, గ్రీన్‌క్లెమైట్ ఆధ్వర్యంలో 65 పాఠశాలల్లో విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన పెంపొందించడంతో పాటు పీవోపీతో తయారు చేసిన వినాయక విగ్రహాల వల్ల కలిగే హాని గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రేంజర్‌ఫోర్స్ సభ్యులు ఎన్. అర్జున, ఎస్. తేజ, చంద్రశేఖర్, గ్రీన్‌క్లెమైట్ సభ్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళలతో మానసిక ప్రశాంతత



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

అల్లిపురం : కళలు హృదయానికి ఆనందాన్ని ఇవ్వడం మాత్రమే కాకుండా మనో వికాసానికి దోహదపడతాయని ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కంచర్ల అచ్యుతరావు అన్నారు. శనివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మహానటి శ్రీదేవి సంగీత సాంస్కృతిక సంస్థ నిర్వహించిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాటల కచేరీలు నిర్వహించడం వలన వర్ధమాన గాయకుల్లో దాగిన ప్రతిభను బయటకు తీయవచ్చన్నారు. పేద వృత్తి కళాకారులను ఆదుకోనున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు పాడిన పాటలు అలరించాయి. సంస్థ వ్యవస్థాపకులు జేఎంఆర్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా అతిథులు, కళా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, సకల కళాకారుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ జాలాది విజయ, వికాసం మాజీ గౌరవాధ్యక్షుడు కొణతాల రాజు, ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, సభ్యులు విజయ్ రమణి, సన్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవీవీని సన్మానించిన ఎమ్మెల్యే వాసుపల్లి



ఎంవీవీ సత్యనారాయణకు బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సన్మానించారు. శనివారం ఎంవీవీ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఎంవీవీ మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, స్టేట్ డైరెక్టర్లు సనపల రవీంద్ర, కాసారపు వాసు, రమణ, రమణమ్మ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన జీవీఎంసీ కాంట్రాక్టర్లు



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్ : కొత్తగా ఎన్నికైన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం శనివారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాదపూర్వకంగా కలిసింది. అధ్యక్షుడు గొంప చంద్రమౌళి ఎన్నికైన కార్యవర్గ సభ్యులను మేయర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ జనవరి నుంచి ఏప్రిల్ 2023 వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణం చెల్లించాలని, సాంకేతిక సమస్యలను నివారించాలని కోరారు. అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అందుకు మేయర్ స్పందిస్తూ త్వరలోనే అధికారులు, కాంట్రాక్టర్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని అసోసియేషన్ అధ్యక్షుడు తెలిపారు. కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, సలహాదారులు పైలా కృష్ణారావు, సీహెచ్ ప్రసాద్, బి. సత్యనారాయణ, ఆర్ఎన్ నాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి అల్లు గోవిందరావు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, సత్యనారాయణ, రాజాన రాంబాబు, గణేష్, ఎస్. శ్రీనివాస్, అప్పన్న, అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజియంలో స్వచ్ఛతపై ఎగ్జిబిషన్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాలతో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం విశాఖ మ్యూజియంలో జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఎకో వైజాగ్, స్వచ్ఛత, ఆర్ఆర్ఆర్ సెంటర్లపై ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులకు ఉచితంగా పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు గ్రాఫిక్స్‌తో కూడిన ఛాయాచిత్రాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 15 నుంచి 17 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు తెలిపారు. 15న దాదాపు 20 స్కూళ్ల విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర కార్యక్రమాలపై టౌన్ హాల్లో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో చలనచిత్ర ప్రదర్శనతో అవగాహన కల్పించారు.

మానసిక వ్యాధిగ్రస్తునికి ఆశ్రయం

అల్లిపురం : మతిస్థిమితం లేని వ్యక్తి ఒకరు మద్దిలపాలెం బస్టాండులో తిరుగుతున్న సమాచారం మేరకు టీఎస్ఆర్ కాంప్లెక్స్, ఏయూటీడీ షెల్టర్ సిబ్బంది ఆ వ్యక్తిని షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. అతని పేరు సోమనాథ్ అని చెబుతున్నాడని, మిగిలిన వివరాలు చెప్పలేకపోతున్నాడని ఏయూటీడీ కార్యదర్శి వాసు, మేనేజర్ జ్యోతిర్మయి ఈ సందర్భంగా తెలియజేశారు. అతనికి చికిత్స అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన హిందీ వారోత్సవాలు



ప్రతిభ వార్షిక పత్రికను అవిష్కరిస్తున్న ముఖ్యఅతిథి, అధ్యాపకులు..

కంచరపాలెం : జ్ఞానాపురంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె. జయలక్ష్మి నేతృత్వంలో జరిగిన హిందీ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ షైజీ శనివారం ముగించారు. శ్రీకృష్ణ విద్యా మందిర్ ప్రిన్సిపాల్ డాక్టర్ నర్మద విశ్వనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. సృష్టి క్లబ్ నుంచి శేఖర్‌ప్రసాద్, హిందీ విభాగం నుంచి సంధ్య గురంగ్‌లకు 'దేవనాగరి'పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ప్రతిభ వార్షిక పత్రిక 17వ సంచికను అవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తి, ఆషీ యాదవ్, అన్వూవా, ప్రణతి, ప్రీతిషా, మానస, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు నెహ్రూబజార్ సమీపంలో గల జిల్లా గ్రంథాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి పౌర గ్రంథాలయ శాఖ సంచాలకులు ఆమోదించిన అంశాలపై చర్చించి ఆమోదించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ, ఏపీ జ్యోతి, వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ డి.చిన్నికృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి ఎంవీఏ శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపక బృందం

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ గుప్తా పాల్గొని ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటి, ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, పోస్టర్ ప్రదర్శన చేపట్టారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణ పద్మ, ప్రొగ్రామ్ కో ఆర్డినేటర్ సంతోషి, అనూష, రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ కల్యాణ్‌రామ్, విద్యాకల్పన, డాక్టర్ ఎ. హైమావతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న అజ్జరపు శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షునిగా అజ్జరపు శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. కళాశాల సెమినార్ హాల్లో పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టింది. విద్యార్థుల సంఘం ఎక్స్ అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తున్న కళాశాల కరస్పాండెంట్ ఏవీఎన్ అదీప్‌భానోజీరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా అజ్జరపు శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎస్. రామసాయి, కోశాధికారిగా టీఎల్ఎన్ భారతి, కార్యవర్గ సభ్యులుగా పీఆర్ నారాయణస్వామి, జి. సువర్ణ, వాసిరెడ్డి శ్రీనివాస్, తలశిల శ్రీనివాస్, డాక్టర్ గోపీనాథ్, కోట మల్లికార్జునరావు, ఎస్. నాగేశ్వరరావు, శేఖర్‌మంత్రి ప్రభాకరరావు ప్రమాణ స్వీకారం చేశారు. 163 ఏళ్ల చరిత్ర గల ఏవీఎన్ కళాశాల చారిత్రక భవనాన్ని పరిరక్షించేందుకు తీసుకోవల్సిన చర్యలపై నూతన కార్యవర్గం చర్చించింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థులను సంఘంలో చేర్చి, కళాశాల ఆధునికీకరణ, అభివృద్ధికి సహకారం తీసుకోవాలని నిర్ణయించారు.

'మోదీ పాలనను తుద ముట్టించడమే లక్ష్యం'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జేవీ సత్యనారాయణమూర్తి

అల్లిపురం : కేంద్రంలో ప్రజా వ్యతిరేక మోదీ పాలనను తుదముట్టించడమే ఇండియా కూటమి లక్ష్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. కలిసి వచ్చే శక్తులను కలుపుకుని రాష్ట్రంలోనూ మోదీ తరహాలోనే పాలన చేస్తోన్న వైఎస్సార్‌సీపీ పాలనకు తెరదించుదామన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు. కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో బోర్లా పడ్డ బీజేపీకి రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో పరాభవం తప్పదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కె. సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, సీఎస్ క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

సీతమ్మధార : జీవీఎంసీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గాంధీ విగ్రహం వద్ద కార్మికులు ధర్నా చేశారు. నేటి నుంచి సకల జనుల కార్మికులందరూ సమ్మెలోకి వెళ్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు కార్మిక నాయకులతో సమావేశమయ్యారు. కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు.

నోటీసు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM, S.OP. 35/2022

BETWEEN:

1) KONCHADA GOURI VENKATA RAMANA RAO
2) KONCHADA GOURI CHANDRA KALA
3) KONCHADA GAYATRI

R/at The General Manager (HR) - AC, HSL, Visakhapatnam .... Petitioners

And

GEOJIT FINANCIAL SERVICES LIMITED

Add: Potluri Castle, H.No. 47-14-9, First Floor, Above HDFC Bank, Dwaraka Nagar, Main Road, Visakhapatnam Respondent-2

ఇందుమూలంగా 2వ ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా, 1వ పిటీషనర్ కుమారుడు 2 మరియు 3 పిటీషనర్ల సోదరుడు అయిన కొంచాడ అభిషేక్ HSL, VSP లో ఉద్యోగం చేస్తూ చనిపోయినందున, మరియు Geojit Financial Services Ltd, లో తన పేర ఉన్న రూ. 5,75,129-65 షేర్ల మొత్తం రాబట్టుకోవడానికి పిటీషనర్లలో చనిపోయిన కొంచాడ అభిషేక్‌నకు వారసులుగా భావించి, 1వ పిటీషనర్ పేర సెక్షన్ సర్టిఫికేట్ ఇప్పించమనికోరి పై పిటీషన్ దాఖలు చేసి యున్నందున, మీకు ఎన్నిసార్లు నోటీసు పంపిననూ, మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసినారు. 2వ ప్రతివాదికి ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల తే. 29-09.2023వ ఉదయం గం.10-30ని॥లకు పైకోర్టు వారి ముందు హాజరై అభ్యంతరములు తెలియజేయవలెను.

Date: 17-09-2023

యల్లపు ప్రతాప్‌కుమార్, అడ్వకేట్, విశాఖపట్నం, సెల్: 9866510995